క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవర్లు



అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మతల్లి దేవర్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి ఒక పర్యాయం నిర్వహించే ఎల్లమ్మ దేవర్లకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు తమ ఇంటి దైవాన్ని పూజించడానికి గ్రామానికి చేరుకున్నారు. ఇంటింటికో పాటేళ్లను బలిచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించా రు. వేపాకు చీరలను కట్టి అమ్మవారి బోనంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి గుడి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. పిల్లాపాపలతో సహా ప్రతి ఒక్కరు బండారు (పసుపు)ను చల్లుకుని అమ్మవారి దీవెనలు అందుకున్నారు. దేవర్లతో గ్రామంలో సందడి నెలకొంది.

నేడు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుల రాక

పాన్‌గల్: మండల కేంద్రానికి బుధవారం ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ, కోళ్ల వెంకటేష్‌తో పాటు సంఘం రాష్ట్ర నాయకులు కూడా హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల నాయకులు రామకృష్ణ, స్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు గ్రామాల్లో ఎస్సీలపై జరుగుతున్న దాడులపై స్థానిక పోలీసులతో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చర్చిస్తారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి వైద్య శిబిరం



ఆత్మకూర్: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. కందూర్ రాంరెడ్డి లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 36 మందికి కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి 26 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. ఆపరేషన్ల నిమిత్తం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో ఎనుగొండలోని కందూరు రాంరెడ్డి ఆస్పత్రికి తరలించామని ఆపరేషన్లతో పాటు రవాణా, భోజన వసతి కల్పించడంతో పాటు ఉచితంగా మందులను ఇవ్వనున్నట్లు హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఎన్జీఓ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణ అంగన్‌వాడీల బాధ్యత



వీపనగండ్ల: పసిపిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో అంగన్‌వాడీ టీచర్లు గురుతర బాధ్యత పోషిస్తున్నారని మహిళా సంఘం నాయకురాలు ఎత్తం చిట్టెమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సంఘ సభ్యులు పలువురు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రభుత్వం నుంచి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, గుడ్లను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల బలోపేతం కోసం వసతులు కల్పిస్తుందని, టీచర్లు, హెల్పర్లు వాటిని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘ కార్యదర్శి ముంత అలివేల, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ, హెల్పర్లు లచ్చమ్మ, నిరంజనమ్మ పాల్గొన్నారు.

తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే చర్యలు

కేటీదొడ్డి: సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ టంగుటూరి శ్రీను అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కిచేడులో గత 3 సంవత్సరాల క్రితం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు విషయంలో జరిగిన వివాదాల పాత వీడియోలు పోస్ట్ చేసి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాసులు గ్రామాన్ని సందర్శించి సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమన్నారు. అట్టి వారిపై జిల్లా సోషల్ మీడియా సెల్ నిఘా ఉంచినట్లు తెలిపారు. తప్పుడు కథనాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి వంతెనతో అవస్థలు

- కోతకు గురైన రోడ్డు
- మూడేళ్లయినా ముందుకు సాగని బ్రిడ్జి పనులు
- ప్రయాణానికి తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



బ్రిడ్జిపై ఇనుప చువ్వలు పరిచి వదిలివేసిన దృశ్యం



భారీ వర్షాలకు కోతకు గురైన ఆర్అండ్‌బీ రోడ్డు (ఫైల్)

పాన్‌గల్: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మూడేళ్లవుతున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. కేతేపల్లి సమీపంలో కొల్లాపూర్–వనపర్తి ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుపై వర్షాకాలంలో వచ్చే ఇబ్బందులను తొలగించేందుకు రూ.3 కోట్లతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణం కోసం 30మార్చి, 2022 సంవత్సరంలో అప్పటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన సమయంలో సంవత్సరంలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినా నేటికీ పూర్తికాలేదు. సంబంధిత కాంట్రాక్టర్ పనులను నాణ్యతగా చేపట్టకపోవడంతో బ్రిడ్జి స్లాబ్ గతంలో కుంగిపోయింది. కుంగిపోయిన స్లాబ్ తొలగించి మరోమారు స్లాబ్ వేయడంతో సీకులు పర్చి వదిలివేడంతో బ్రిడ్జి అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి పక్కన ఉన్న రోడ్డు కోతకు గురికావడంతో ఈ రోడ్డుపై రాకపోకలను ఒకటి, రెండు రోజులు నిలిపివేశారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు చేపట్టకపోవడం, మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో బ్రిడ్జిపై సీకులు పర్చిన దానిపై నుంచే వాహనాలు వెళ్తున్నాయి. సీకులు తేలి ఉండటంతో వాహనాలకు సీకులు తగులుతూ ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకవెళ్లినా స్పందన లేదని వాహనదారులు మండిపడుతున్నారు. మంత్రి జూపల్లి ప్రత్యేక దృష్టి సారించి బ్రిడ్జిపై నిర్మాణం పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు

కేతేపల్లి గ్రామంలో రూ.1.99 కోట్లతో చేపడుతున్నా రోడ్డు విస్తరణ పనులు మూడు నెలలు దాటినా నత్తనడకన సాగుతున్నాయి. విస్తరణలో భాగంగా ఇళ్లు, ఆలయం ప్రహారీ, రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉండటంతో పనులు ముందుకు సాగడంలేదు. ఆలయానికి సంబంధించి గ్రామస్తుల అభిప్రాయం మేరకే పనులు కొనసాగిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



వనపర్తి–కొల్లాపూర్ ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తికాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభించి మూడేళ్లు దాటిన నేటికీ పూర్తి కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ రోడ్డు ద్వారా ప్రతినిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలి.

– శివరాంయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు, పాన్‌గల్

మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం



కాంట్రాక్టర్ స్పందించకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతుంది. మిగిలిన పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎస్ఈకి నివేదించాం. ఎస్ఈ నుంచి అనుమతులు రాగానే వేరే కాంట్రాక్టర్‌కు అగ్రిమెంటు చేసి పనులు పూర్తి చేయిస్తాం. గ్రామంలోని రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసే లోపల బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొస్తాం.

– రాకేష్, ఇన్‌చార్జ్ ఏఈ, పాన్‌గల్

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీరాములు తన వంతు సాయంగా రూ.1,00,116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కొత్తకోట నాయీబ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు ఎ.భాస్కర్, ఉపాధ్యక్షులు ఎ.కృష్ణయ్య, శంకర్, జి.రామస్వామి, కుప్పుస్వామి, మాసన రాంచంద్రయ్య, సురేష్, నాగరాజు, ప్రసాద్, రాజేష్, సందీప్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ఆరేపల్లిలో..



వెంగళాయపల్లిలో విజేతలకు మెమొంటోను అందజేస్తున్న నిర్వాహకులు, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లిలో ఉగాది పండుగ సందర్భంగా బంగ్లా రాములు జ్ఞాపకార్థం వారి కుమారులు బంగ్లా సుజీవన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంగళాయిపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు, మెమోంటో, రన్నర్ జట్టుకు రూ.5 వేలు నగదు, మెమోంటోను అందజేశారు. గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన గ్రామస్తులు, యువతకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు బంగ్లా సుజీవన్, మురళి, బండి ఆంజనేయులు, బీంరెడ్డి, నారాయణరెడ్డి, కరాటే గోపాల్, నర్సింహ, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీఎల్ ప్రీమియర్ లీగ్ మండల స్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. మొదటి బహుమతి విజేత శివాజీ వారియర్స్ టీంకు రూ.20,116, రెండో బహుమతి వివేకానంద టీంకు రూ.13,116, మూడో బహుమతి శ్రీరామ వారియర్స్ టీంకు రూ.7,116, నాల్గో బహుమతి హనుమాన్ టీం రూ.5,116, ఐదో బహుమతి భగత్‌సింగ్ వారియర్స్ టీంకు రూ.5,116 నగదుతో పాటు షీల్డులను బహుకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీవైస్ ఎంపీపీ కోటేష్, మాజీసర్పంచ్ అనసూయ, యగంధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకులానికి విద్యార్థి ఎంపిక



ఆత్మకూర్: మండలంలోని మోట్లంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అజిత్ ఐదో తరగతి గురుకులంలో సీటు సాధించినట్లు లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జా అన్వర్‌బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రవేశ పరీక్షలో అజిత్ 319వ ర్యాంకు సాధించడంతో ఎంఈఓ బాలరాజు, పాఠశాల హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయులు విజయ్, శాంతన్న, రాఘవేందర్, మాజీ సర్పంచ్ నాగన్న, కోచింగ్‌సెంటర్ నిర్వాహకులు అప్సర్‌బేగ్, ఆలీయాఅంజుమ్, షహనబేగం, నందిని, కావ్య అభినందించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: ఆదిత్య పరాశ్రీస్వామి ఆధ్వర్యంలో ఈనెల 4న అంబాత్రేయ నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వారం గ్రామ శివారులో గల అంబాత్రయ క్షేత్రంలో నిర్వహించనున్న గోమాత కల్యాణం వాల్‌పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో హిందూవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక కల్యాణార్థం నిర్వహించే గోమాత కల్యాణాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వీక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త పోచ రవీందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వేణు, కిషోర్, కంది వెంకటరమణ, పిరమిడ్ ధ్యాన నిర్వాహకులు ఉమేష్ ఉన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వండి



ఎమ్మెల్యే జీఎమ్మార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కావాల్సిన ఇసుకకు సంబంధించి అనుమతులు ఇప్పించాలని నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కోరారు. మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను దమగ్నాపూర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇసుక కొరత కారణంగా అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆలయ నిర్మాణ పనులు నిలిచిపోయాయని, ఇసుక అనుమతులకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే జీఎమ్మార్ సానుకూలంగా స్పందించి అనుమతులు ఇప్పించేందుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్, గణేష్, ఆలయ కమిటీ నిర్వాహకులు రమాకాంత్, రవీందర్, బాలకృష్ణ, వెంకట్రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఖిల్లాఘనపురం: వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడే వడదెబ్బ బారిన పడకుండ ఉంటామని కళాజాత బృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఉప్పరిపల్లిలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారు ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కళాబృందం టీం లీడర్ డప్పు నర్సింహతో పాటుగా సభ్యులు శివలింగం, సువర్ణ, రాధ, కృష్ణయ్య, రాజు, శ్రీనివాసులు పాటలు, నృత్యాల ద్వారా ప్రజలకు అర్థం అయ్యే విధంగా చెప్పారు. ముఖ్యంగా ప్రస్తుత ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎవరికైనా వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అదేవిధంగా వేసవిలో తరుచుగా వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ ఆదేశం మేరకు వారం రోజుల పాటుగా మండలంలోని ప్రతి గ్రామం తిరుగుతూ కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు



పెద్దగూడెం కోదండరామస్వామి ఆలయం



ఆలయంలోని ఉత్సవ విగ్రహాలు

- ముస్తాబైన పెద్దగూడెం కోదండరామస్వామి ఆలయం
- ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం కోదండరామస్వామి ఆలయంలో బుధవారం నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు కల్పించారు. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో ఆలయం వెలిసినట్లు స్థల పురాణం చెబుతోంది. ఆలయాన్ని వనపర్తి సంస్థానాధీశురాలు రాణిశంకరమ్మ తన భర్త రాజారామేశ్వర రావు జ్ఞాపకార్థం 1791లో నిర్మించారు. తమిళనాడులోని వనామలై మఠాధిపతి మధురకవి రామానుజాచార్య చేతుల మీదుగా ఆలయ నిర్మాణం జరిగింది. విగ్రహ ప్రతిష్ఠాపన ముహూర్తం ఆధారంగా జీయర్‌స్వామి ఆదేశాల మేరకు ఉత్సవాలు రాత్రివేళ నిర్వహించడం ఆనవాతీగా వస్తోంది. ఏ ఆలయంలోనైనా శ్రీరామనవమి రోజు ఉదయం సీతారాముల కల్యాణం జరగనుండగా.. ఇక్కడ మాత్రం సప్తమి రోజున కల్యాణం ఉంటుంది. ఉత్సవాలను రాజారామేశ్వరరావు సంస్థానాధీశులు గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నారు. ఉత్సవాలు బుధవారం నుంచి 7వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేడుకలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- బుధవారం ఉదయం పుణ్యాహవాచనం, రాత్రి అంకురార్పణ పూజలు
- గురువారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి భేరీపూజ, దేవతాహ్వానం
- శుక్రవారం నిత్యహోమం, బలిహరణం, రాత్రి సీతారాముల కల్యాణం
- శనివారం ఉదయం నిత్య హోమం, రాత్రి ప్రభోత్సవం
- ఆదివారం ఉదయం నిత్యహోమం, బలిహరణం, రాత్రి రథోత్సవం
- సోమవారం చక్రస్నానంతో ఉత్సవాల ముగింపు ఉంటుందని ఆలయ అర్చకులు రమణాచారి తెలిపారు.

ముందస్తు అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



వనపర్తి రాజీవ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నాయకుల మీద పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో సీపీఎం వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూముల రక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో యూనివర్సిటీ గేటు ఎదుట ధర్నాకు వెళ్లకుండా సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించాలని కోరారు. 400 ఎకరాల హెచ్‌సీయూ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ఇప్పటికైనా విరమించుకోని, విద్యార్థుల మీద పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, బాల్‌రెడ్డి, కురుమయ్య, గంధం మదన్, గట్టయ్య, బాలరాజు, నందిమళ్ల రాములు, ఉమ, బీసన్న, కురుమయ్య, పుల్లయ్య, బాలపీరు, కమలాకర్, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థుల సమస్యల కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం అన్యాయమని మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమిని వేలం వేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న తమ కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం వల్ల ఉద్యమాలను అణచలేరని ఆయన అన్నారు. పోలీసుల అదుపులో సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్, నవీన్ ఉన్నారు.

అమరచింత: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూములను ప్రభుత్వం వేలం వేసి, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ చేపడుతున్న చలో హెచ్‌సీయూ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని సీపీఎం నాయకులు అజయ్, రమేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టులు చేయడం తగదన్నారు.

వన్యప్రాణులు, పర్యావరణాన్ని కాపాడాలి

గోపాల్‌పేట: ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని గోపాల్‌పేట యువకులు అన్నారు. హెచ్‌సీయూలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై గోపాల్‌పేట యువకులు మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయానికి సంబంధించి మండల కేంద్రానికి చెందిన కొందరు యువకులు వందల ఎకరాల్లో ఉన్న భూముల్లో జీవవైవిధ్యం ఉందని, పర్యావరణాన్ని కాపాడుకోవడం, వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ విషయానికి సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు చర్చించారు. అనంతరం గోపాల్‌పేట బస్టాండులో కొవ్వొత్తులు వెలిగించి ప్రకృతిని కాపాడాలని నిరసన తెలిపారు.



అమరచింత పోలీస్ స్టేషన్‌లో..



వీపనగండ్లలో..



గోపాల్‌పేట బస్టాండులో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న యువకులు

శిథిలావస్థలో వంతెన

- భయాందోళనలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలు వద్ద నాలుగు దశాబ్దాల కిందట ప్రయాణికుల సౌకర్యార్థం వంతెనను నిర్మించారు. 1984 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రావు బ్రిడ్జిని ప్రారంభించారు. దీంతో కొల్లాపూర్ నుంచి పెంట్లవెల్లి, జటప్రోలు, పెబ్బేరు వయా కర్నూల్ వరకు నిత్యం 24 గంటలు పాటు బస్సులు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం జటప్రోలు బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఎప్పుడు ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే, మంత్రి, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం కొల్లాపూర్ నుంచి పెబ్బేరు ప్రధాన రహదారి కావడంతో ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. బ్రిడ్జిపై ఇరువైపులా ప్రహరీ పూర్తిగా దెబ్బతినడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి కింద దాదాపు 20 మీటర్ల మేరకు ఆరు నెలల పాటు కృష్ణానది నీరు ప్రవహిస్తుంటుంది. రెండు సంవత్సరాల కిందట లారి అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి నదిలో పడింది. ఎవరికి ఏప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు శ్రద్ధ వహించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా ఇటీవల గ్రామానికి చెందిన ఐదు మంది ప్రభుత్వ ఉద్యోగులు పొందటంతో వారిని సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు బాలకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి చింతకుంట భా స్కర్, కార్యవర్గ సభ్యులు, ప్రజలు ఉన్నారు.